క్లుప్తంగా

కుట్టు మిషన్లు పంపిణీ



నెహ్రూనగర్: బ్రైట్ హారిజన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పొన్నూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు స్వయం ఉపాధి కింద కుట్టు మిషన్లు, గ్రైండర్లు, కిరాణా, ఫ్యాన్సీ షాపు నడుపుకునేందుకు సామన్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఎంకేఎస్ మొహిద్దీన్ మాట్లాడుతూ పేద మైనార్టీ ప్రజల విద్యా, ఉపాధి, ఉద్యోగ కల్పన మీద తమ సంస్థ పనిచేస్తుందని చెప్పారు. ముస్లిం మహిళలకు స్వయం ఉపాధి పెంచి మహిళా సాధికారత సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, డైరెక్టర్స్ డాక్టర్ ఖలీల్ ఇబ్రహీం, డాక్టర్ సలీం పాషా, షేక్ అన్సర్‌బాబు, పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శనివారం శ్రీ లలితా నృత్యాలయ అకాడమీ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. ప్రసన్నలక్ష్మీ ఉద్దిశెట్టి అధ్యక్షత వహించగా, దక్షిణ డీఎస్పీ భానోదయ, శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ఆలయ పాలక మండలి సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను అలరించాయి. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు అందించారు.

ముగిసిన జిమ్నాస్టిక్స్ శిక్షణ



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గత నెల రోజుల నుంచి జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు ఉల్లాసంగా ముగిసాయని జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన ముగింపు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ శిక్షణ ప్రతి రోజూ కొనసాగించాలని, దీనికి తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని తెలిపారు. శిక్షణలో సుమారు 200 మంది చిన్నారులు క్రమశిక్షణతో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కోచ్ అఫ్రోజ్, కృష్ణ తేజ, ఎం.శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

- పెదనందిపాడులో 64.2 మి.మీ వర్షం
- నగటు 27 మి.మీ వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా పెదనందిపాడు మండలంలో 64.2 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 1.8 మి.మీ వర్షం పడింది. సగటున 27 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకుమాను మండలంలో 63.8 మి.మీ., ప్రత్తిపాడు 46.2, పెదకాకాని 44.2, తాడేపల్లి 43.6, తెనాలి 43.6, గుంటూరు పశ్చిమ 40.2, మంగళగిరి 37.6, గుంటూరు తూర్పు 36.4, దుగ్గిరాల 15.6, మేడికొండూరు 10.2, చేబ్రోలు 10, పొన్నూరు 8.6, కొల్లిపర 6.6, తుళ్ళూరు 4.6, వట్టిచెరుకూరు 4.6, ఫిరంగిపురం మండలంలో 4 మి.మీ చొప్పున వర్షం పడింది. మే నెల 31వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 62.2 మి.మీ పడాల్సి ఉండగా, 222.7 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి

మేయర్ రవీంద్ర



విజేతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, వేదికపై ఎమ్మెల్యే గళ్ల మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నగర పాలక సంస్థ ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు- 2025 ముగింపు వేడుకలకు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గళ్లా మాధవి హాజరయ్యారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ, ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో 802 మంది చిన్నారులు వివిధ క్రీడాంశాల్లో నెల రోజుల పాటు పాల్గొన్నారని చెప్పారు. వీరిలో అధికంగా స్విమ్మింగ్, స్కేటింగ్, బాస్కెట్ బాల్ ఆటల్లో పాల్గొన్నారని, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో ఎక్కువమంది చిన్నారులు క్రీడల్లో పాల్గొనేలా స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని, తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియాన్ని ఆధునిక హంగులతో నిర్మించడానికి కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ కృషి చేస్తున్నారని వివరించారు. ప్రస్తుత విద్యా విధానంలో పలు పాఠశాలల్లో క్రీడామైదానాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుంటూరు ఖ్యాతిని చాటుతున్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గళ్లా మాధవి మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు క్రీడల్లో శిక్షణ పొందటానికి చిన్నారులకు అవకాశం కల్పించిన జీఎంసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. స్టేడియంలో మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వచ్చే ఏడాది ఎక్కువమంది చిన్నారులు పాల్గొనటానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించారు. పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియం క్రీడల కేంద్రంగా నిలిచేలా కృషి చేస్తామని తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, స్టేడియంలో జరుగుతున్న సుమ్మర్ క్యాంపునకు విశేష స్పందన వచ్చినట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో అధునాతన వసతులతో స్టేడియం అభివృద్ధి చేస్తామన్నారు. స్టేడియం లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మరిన్ని మౌలిక వసతులు కల్పించి పిల్లల క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థులు క్రీడల్లో ఆసక్తిగా పాల్గొనడంతో పాటు చదువుల్లో కూడా ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు నరేంద్ర, జనసేన నాయకులు ఆళ్ల హరి పాల్గొన్నారు.

నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం ప్రారంభించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పంపిణీని పరిశీలించారు. వడ్డె గూడెంలో పింఛన్ల పంపిణీ, లాంచెస్టర్ రోడ్‌లో పారిశుద్ధ్య పనులు, జాతీయ రహదారి దగ్గర అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందే పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. నగరంలో వార్డు సచివాలయ కార్యదర్శులు తమకు కేటాయించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి శనివారం సాయంత్రానికే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యదర్శులు తమ పరిధిలో పింఛన్ల పంపిణీ అనంతరం వివరాలను ఉపా సెల్‌కి అందించాలని కోరారు. అనంతరం లాంచెస్టర్ రోడ్‌లో పారిశుద్ధ్య పనులు, జాతీయ రహదారి దగ్గర అవుట్ ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులు మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేసేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని కోరారు. అంతర్గత డ్రెయిన్ల నుంచే ప్లాస్టిక్ వ్యర్థాలు ఔట్ ఫాల్ డ్రెయిన్లలో కలసి మురుగు పారుదలకు అడ్డుగా ఉంటున్నాయని పేర్కొన్నారు. అవుట్ ఫాల్ డ్రెయిన్లు కల్వర్ట్‌ల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఎస్ రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరం



మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ రవిబాబు

లక్ష్మీపురం: మార్కులూ, ర్యాంకులూ తప్ప విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పట్టించుకోని అశాస్త్రీయమైన విద్యావిధానాలే విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమని విద్యావేత్త, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్. రవిబాబు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'భవితరాన్ని ఒత్తిడికి గురి చేస్తున్న చదువులు' అన్న అంశంపై శనివారం చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు మూడు నెలల్లోనే తెలుగు రాష్ట్రాల్లో పలువురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తాజాగా రెండు రోజుల్లో నలుగురు విద్యార్థులు, రాజస్థాన్‌లో కోటాలో ఈ ఏడాదిలో ఇంత వరకు 15 మంది విద్యార్థులు తమకు తామే మరణ శాసనాలు రాసుకోవడం తీవ్ర ఆందోళనకు గురిచేసే విషయమన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, సీనియర్ సిటిజన్స్ సంఘం నాయకులు ఆర్.వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం

సీపీఎం రాష్ట్ర నాయకుడు బాబూరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

లక్ష్మీపురం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ నాయకుడు ఈమని అప్పారావు అధ్యక్షత వహించారు. బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమృత్ సిటీలుగా ఉన్న గుంటూరు, మంగళగిరి, రాజధాని ప్రాంతంలో ఆదాని ఒప్పందంలో భాగంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించారు. భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని కూటమి మేనిఫెస్టోలో చెప్పారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు సార్లు సర్దుబాటు ఛార్జిల పేరుతో రూ.15,485 కోట్లు భారం మోపిందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన నష్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసిందని దానిని అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆస్తి ఆధారిత ఇంటి పన్నుల విధానాన్ని వ్యతిరేకించిన, కూటమి నాయకులు, ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ విధానాన్ని రద్దు చేయకుండా మరింతగా పన్నులు భారాలు మోపే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా రీ అసెస్ మెంట్ పేరుతో మరో 20 శాతం ఇంటి పన్ను పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపే ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పాశం రామారావు, ఎస్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, వి.జవహర్‌లాల్, జె.వి.రాఘవులు, ఎస్.ఎస్.చెంగయ్య, కె.అజయ్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, ఎం ఏ చిష్టీ, ఎల్.అరుణ, యు.దుర్గారావు పాల్గొన్నారు.

పొగాకుపై అవగాహన ర్యాలీ



లక్ష్మీపురం: కేర్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో పొగాకుపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. గాంధీపార్క్ నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ప్రొఫెసర్ డాక్టర్ అవినాష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్ మాట్లాడుతూ ప్రతి ఏటా మే 31న జరుపుకునే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం, పొగాకు వినియోగం వలన కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి, దాని వాడకాన్ని తగ్గించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో ప్రారంభించినట్లు చెప్పారు. పొగాకు వాడకం వలన సంవత్సరానికి 80 లక్షలకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. క్యాన్సర్, గుండె జబ్బులు, స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధులు, సంతానోత్పత్తి సమస్యలు, మరియు అకాల మరణం వంటి పొగాకు వల్ల కలిగే హానికరమైన ప్రభావాల అన్నారు.

నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: పొగాకు వినియోగిస్తే రోగాల బారిన పడతారని గుంటూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కె.వి.సత్యనారాయణ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చాలా మందికి పొగాకు వల్ల వచ్చే ప్రమాదల అవగాహన లేకపోవడం వలనే వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ మాట్లాడుతూ అలవాటును మాన్పించేందుకు అనేక కేంద్రాలు, కౌన్సెలింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలను అందించటానికి నూజివీడులో నవజీవన్ సంస్థ 'బోస్కో డి అడిషన్ సెంటర్' ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే సీటీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిగురుపాటి సేవలు అభినందనీయం



సత్కారం అందుకున్న రాజమల్లేశ్వరరావు దంపతులు

గుంటూరు వెస్ట్: గుంటూరులోని ఆడిట్ కార్యాలయంలో సహాయ అధికారిగా పనిచేసిన చిగురుపాటి రాజమల్లేశ్వరరావు సేవలు ఆదర్శప్రాయమని జిల్లా ఆడిట్ అధికారి బి.ధనలక్ష్మి కొనియాడారు. రాజమల్లేశ్వరరావు పదవి విరమణ సందర్భంగా స్థానిక కార్యాలయంలో సన్మాన సభ శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 43 సంవత్సరాల పాటు నిస్వార్థంగా డిపార్టుమెంట్‌కు సేవలందించారన్నారు. ప్రతి ఉద్యోగి ఉద్యోగంలో చేరినప్పటి నుంచి సర్వీసు ముగిసేంత వరకు ప్రజలకు ఎంత సేవ చేశామనే అంశాన్ని ఆత్మలోకం చేసుకోవాలన్నారు. ఉద్యోగి విజయవంతమైన సర్వీసు వెనుకాల సహచరుల తోడ్పాటుతోపాటు అతని కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజమల్లేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

దేశ సమైక్యతకు పాటుపడదాం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

లక్ష్మీపురం: మతాలను, కులాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపడ్డారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో శనివారం నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరున్ కుమార్ అధ్యక్షతన నగర సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి ఎప్పటికైనా ప్రమాదమేనని అన్నారు. మోదీ, అమిత్‌షాలు బిహార్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఎన్నికలను ఆసరాగా చేసుకుని తాము అధికారంలో రావడానికి యుద్ధాల పేరుతో ఆర్మీ జవాన్లను పొట్టన పెట్టుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన గిరిజనులను, ఆదివాసులను పొట్టన పెట్టుకుంటారని విమర్శించారు. తక్షణమే కగార్ ఆపరేషన్ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లేమో గాని ప్రజలు కష్టాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయల ఇస్తానని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా వ్యాపితంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద జూన్ రెండో తేదీన అర్జిదారులతో ధర్నా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడారు.



● రోడ్డు బురదమయం..

నగరంపాలెం: ఇటీవల కురిసిన వర్షాలకు లక్ష్మీపురం ఒకటో వీధి బురదమయంగా మారింది. లోతట్టు గుంతలుగా మారడంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదవశాత్తు బురదలో పడిపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

రైల్వే స్టేషన్‌లో జూట్‌బ్యాగులు పంపిణీ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన డీఆర్‌ఎం సుధేష్ణ సేన్



వీఐపీ లాంజ్‌లో ప్రయాణికులకు జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న డీఆర్‌ఎం

లక్ష్మీపురం: పర్యావరణాన్ని మరియు వ్యక్తి ఆరోగ్య ప్రమాణాలను కాపాడే మంచి జీవనశైలిని అనుసరించాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ కోరారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో శనివారం జూన్ 6న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రకాల కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రయాణికులకు అవగాహన కల్పించి జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. తొలుత రైల్వే స్టేషన్‌లో నుక్కడ్ నాటకం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి అవగాహన కల్పించారు. ప్లాట్‌ఫాం నంబర్ ఒకటిలో సుమారు 50 మంది ఉత్సాహభరితమైన విధంగా పిల్లలు ఫ్లాష్ మాబ్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కొనసాగేలా కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నివారించాలని, క్లాత్ బ్యాగ్‌ల వంటి స్థిరమైన ప్రత్యామ్నాయాలను స్వీకరించాలని కోరారు. ఏడీఆర్‌ఎం సైమాన్, సీసీఎం డి.మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ జె.వి.అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, డీసీఎం కో-ఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ సీనియర్ డీఓఎం షాహబాజ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి దేవస్థానం ఈఓగా సునీల్ కుమార్

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలో వేంచేసి యున్న శ్రీ నరసింహ స్వామి దేవస్థానం నూతన ఈఓగా కోగంటి సునీల్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వర్తించిన సునీల్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రామకోటిరెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు రాదని..

ఇల్లు వదిలి వెళ్లిన విద్యార్థి



లక్ష్మీపురం: ఐఐటీల్లో ప్రవేశానికి ఇటీవల నిర్వహించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు రాదని, ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా యువకుడు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శారదా కాలనీ 15వ లైన్‌కు చెందిన నల్లపు అభినయ్ ఇంటర్ పూర్తి చేసుకుని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాశాడు. పరీక్షల బోర్డు విడుదల చేసిన అడ్వాన్స్‌డ్ కీలో తక్కువ మార్కులు రావడంలో ఈనెల 28వ తేదీన రాత్రి ఎవరికి చెప్పండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి ఇమ్మానియేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు 0863-2231955, సీఐ ఆరోగ్య రాజు 8688831332 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.